
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com
29-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

**ఇంటర్ మెమోల్లో నకిలీలకు చెక్..** 2



**ఓటరు జాబితాలో తప్పులు సరిచూసుకోవాలి** 2

## తెయూలో జాతీయ క్రీడా దినోత్సవం




**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాంబాబు, క్రీడల డైరెక్టర్ బాల కిషన్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ చక్రవర్తి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బల్దియా రణరంగం



- బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల వాగ్వాదం
- పోడియం ముందు బీఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసన
- అక్రమ కట్టడాలపై డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణ

**ప్రజాసమస్యలకు పరిష్కారం చూపాల్సిన బల్దియా కార్యాలయం విమర్శలు, ప్రతి విమర్శలతో రణరంగాన్ని తలపించింది. ఒకరిపై ఒకరు మాటల తూటాలు విసుకురుకున్నారు. కుర్చీలు ఎత్తారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో కౌన్సిలర్ల తీరుతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. – అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి మున్సిపాలిటీ సమావేశం రసాభాసగా మారింది. పారిశుధ్యం, ఇతర ముఖ్యమైన 9 అంశాలతో బల్దియా సమావేశం శనివారం నిర్వహించారు. ఎజెండా అంశాలకు పరిపాలన ఆమోదం పొందితే సమస్యలు పరిష్కారం అయ్యేవి. అయితే ఎజెండాపై చర్చ సాగకుండానే వార్డులో సమస్యలపై సమావేశంలో ప్రస్తావన తేవడంతో సమస్య తీవ్రరూపం దాల్చి దాదాపు కొట్టుకునే వరకు వెళ్లింది.

### రసాభాసగా సమావేశం

ఇప్పటికే వరుస వాయిదాలతో అపవాదు మూట కట్టుకోగా శనివారం మరోసారి తీవ్రస్థాయిలో కౌన్సిల్ సభ్యులు రెచ్చిపోయారు. సమస్యలపై చర్చ సాగకుండానే కుర్చీలు లేపి, పోడియం ముందు బైఠాయించి, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ నినాదాలతో కౌన్సిల్ హాలును రణరంగంగా మార్చారు. అధికారులను ప్రశ్నిస్తుండగా మీరెవరు అంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు అడ్డు పడటంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు పోడియం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

### పైపైకి దూసుకెళ్తూ

సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు కుర్చీలను కింద పడేశారు. బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఒకరిపైకి ఒకరు దూసుకుని వెళ్లడంతో కౌన్సిల్ సమావేశం అదుపు తప్పింది. కమిషనర్ సర్ది చెప్పినా వినకపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను శాంతింపజేశారు. అడిషనల్ కలెక్టర్ చేరుకుని కౌన్సిలర్లతో మాట్లాడి సమావేశాన్ని కొనసాగించారు

### అధికారంలో ఉన్నామంటున్నారు

రాష్ట్రంలో అధికారంలో తామే ఉన్నామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, రాష్ట్రంలో అధికారంలో ఉండటానికి మున్సిపాలిటీకి సంబంధం ఏమిటని బీజేపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. కామారెడ్డిలో వరదలు వచ్చి ఏడాది అయిందని, సీఎం వచ్చి వెళ్లినా ఒక్క రూపాయి తీసుకువచ్చే తెలివి లేదని ఎద్దేవా చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమాలు జరగనివ్వమని, ప్రజల పక్షాన ఎల్లప్పుడూ పోరాటం చేస్తూనే ఉంటామన్నారు

### అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..

మున్సిపాలిటీలో అభివృద్ధిని బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు. గత రెండు ఎజెండాలు ఆమోదానికి నోచుకోలేదన్నారు. మూడేళ్లలో ప్రజల పక్షాన పోరాటం చేయడంలో బీఆర్ఎస్ విఫలమైందన్నారు. బీజేపీ ఎమ్మెల్యే కామారెడ్డికి ఒక్క రూపాయి నిధులు తేలేదని, ఒక్క కొబ్బరికాయ కూడా కొట్టి అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రతిసారి సమావేశాన్ని అడ్డుకుని ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా చేస్తున్నారని ఆరోపించారు.

### మీరెవరు అంటారా..

అక్రమ కట్టడాలు, సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ కౌన్సిలర్లు అడ్డుకుని మీరెవరు అడగడానికి అంటున్నారని బీఆర్ఎస్ నేతలు అన్నారు. తాము కౌన్సిలర్లం కాదా అని ప్రశ్నించారు. తమను అణగదొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో అక్రమ కట్టడాల వద్దకు అధికారులను పంపించి నోటీసులిప్పిస్తున్నారని, ముడుపులు చేతులు మారగానే ఆ నోటీసులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అధి కారులను అడిగే హక్కు తమకు ఉందన్నారు. ఇక నుంచి నోటీసులు ఎవరికి ఇచ్చినా మూడు పార్టీలతో చర్చించాలని, నోటీసులపై ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. కమిషనర్ ఏ పార్టీకి లొంగకుండా ఉంటే తాము మద్దతుగా ఉంటామని పేర్కొన్నారు.

## యాప్‌లో దక్కని యూరియా.. రైతులకు తీవ్ర నిరాశ



**అక్షరటుడే, నందిపేట్:** మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బుకింగ్ యాప్‌లో ఈరోజు ఉదయం 10 గంటలకు యూరియా అందుబాటులో ఉంటుందనే సమాచారంతో రైతులు తమ ఫోన్లతో సిద్ధంగా ఉన్నారు. అయితే సంబంధిత యాప్‌లో యూరియా స్టాక్ కనిపించిన కొన్ని సెకన్లలోనే యూరియా మాయమవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. రైతులు గంటల తరబడి యాప్‌ను చూస్తూ యూరియా బుకింగ్ కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ సెకన్లలోనే యూరియా అయిపోతుండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరి పంటకు సరైన సమయంలో యూరియా అందించకపోతే నష్టం వాటిల్లుతుందని రైతులు బాధపడుతున్నారు.

### ఓటీపీ ఎంటర్ చేసేలోపే

గంటల తరబడి ఎదురు చూసి స్టాక్ వచ్చిందని ఓటీపీ కొట్టేలోపే యూరియా మాయం అవుతోంది. దీనివల్ల వరికి సరైన సమయంలో యూరియా వేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి యూరియా యాప్ లో సవరణలు చేయాల్సిన అవసరం ఉంది. కేవలం గ్రామ శివారు ఆధారంగా సొసైటీలకు కింద వచ్చే రైతులకు మాత్రమే యూరియా బుకింగ్ చేసుకోవడానికి మాత్రమే అవకాశం కల్పించాలి. - **దొడ్డి కింది దేవన్న, రైతు, నందిపేట్**

## బీఆర్ నేతకు మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డు



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. బీఆర్ నేతకు మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డు 2026 ప్రదానం చేశారు. జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాల కిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. నేత 2004 ఏడాదిలో బీపీఈడీ , 2007లో ఎంపీఈడీ, 2010లో పీజీ డిప్లమా ఇన్ హెల్త్ ఫిట్నెస్ అండ్ లైఫ్ స్టైల్ మేనేజ్‌మెంట్ , 2013లో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఎంఫిల్ , 2021లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్డీ పట్టా పొందారు. అవార్డు అందుకున్న నేతకు వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## గ్యాస్ పొయ్యిపై వంట చేయాలి



**అక్షరటుడే, కోటగిరి :** మధ్యాహ్న భోజనం కోసం తప్పనిసరిగా గ్యాస్ పొయ్యిపైనే వంట చేయాలని కోటగిరి మండల స్పెషల్ ఆఫీసర్, డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండల సమావేశంలో భాగంగా అన్ని శాఖల పనితీరుపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నాలుగో విడత బిల్లులు మంజూరయ్యాయని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా నాటుతున్న మొక్కలు వాటి నిర్వహణను గాలికి వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు మొక్కలను నరికి వేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలోని డివిజన్లలో పర్యటించిన కమిషనర్



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** నగరంలోని పలు డివిజన్లలో శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్ పర్యటించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఆయన డివిజన్లలో నోటీసుల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 29, 30, 31వ డివిజన్లలో పర్యటించిన ఆయన ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పంపిణీ, స్వీకరణ ప్రక్రియ నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. స్వీకరించిన నోటీసుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఎన్నికల సిబ్బందికి సూచనలు జారీ చేశారు. అదేవిధంగా, ఎన్నికలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిర్దేశిత విధానాల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

## పోచారంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని పోచారం గ్రామంలోని తన నివాసంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పోచారం మాట్లాడుతూ.. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత పెరుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఐఆర్ నోటీసులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ఒక్కరి ఓటు హక్కు కూడా కోల్పోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 2 నుంచి జుక్కల్‌లో బీఆర్ఎస్ 'సమరభేరి'




**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సెప్టెంబర్ 2వ తేదీ నుంచి జుక్కల్ నియోజకవర్గంలో వారం రోజుల పాటు బీఆర్ఎస్ 'సమరభేరి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తెలిపారు. శనివారం పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. సమరభేరిలో భాగంగా గ్రామగ్రామాన ప్రజలను కలిసి, ప్రభుత్వం నెరవేర్చని హామీలను, ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలన్నీ అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు వీజీ గౌడ్, భిక్షపతి స్వామి, మాజీ జెడ్పీ ఛైర్మన్ దఫేదార్ రాజు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోర్గాం(పి) స్కూల్ మైదానాన్ని విస్తరించేందుకు కృషి చేస్తాం: కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని బోర్గాం(పి) స్కూల్ మైదానాన్ని విస్తరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న బోధనా సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే అత్యధికంగా ఈ పాఠశాలలో 1,120 మంది విద్యార్థులు చదువుకోవడం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు రావడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలుపడంతో, స్కూల్‌కుకు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వీటిని సమీపంలో మరో చోటికి మార్చేందుకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించాలని, దీనివల్ల పాఠశాలకు క్రీడా మైదానం వసతి సమకూరడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బడికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని సైతం కొంతమేర సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదవ తరగతిని సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఆయన పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులను బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు.



పిల్లలను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా బయటి ప్రపంచానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం కూడా కల్పించాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. ఏకాగ్రతతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రతిభను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర్ వెంట డీఈవో అశోక్, మోపాల్ తహశీల్దార్ రేఖ, ఎంఈవో సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు



**అక్షరటుడే, బాన్సువాడ :** పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా వద్ద విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనతో మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా ప్రమాదాలకు కారణమవుతున్న అడ్డంకులను గుర్తించి తొలగించే పనులను అధికారులు వేగవంతం చేశారు. ప్రమాదం జరిగిన అనంతరం ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, పట్టణ సీఐ తుల శ్రీధర్ తాడ్కోల్ చౌరస్తాను పరిశీలించారు. చౌరస్తా మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించకపోవడానికి పలు కారణాలను గుర్తించారు. రహదారికి ఆనుకుని ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం, డివైడర్, రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన షెడ్లు, తోపుడు బండ్లు, ఫ్లెక్సీలు ట్రాఫిక్ రాకపోకలకు ఆటంకంగా మారుతున్నట్లు గుర్తించారు. అడ్డంకులను తొలగించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో రహదారి విస్తరణ చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.



## టీఆర్ఎస్ పార్టీ సభ వేదికను పరిశీలించిన జిల్లా ఇన్‌ఛార్జి రఘు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఈనెల 31న జరుగనున్న తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సంకల్ప సభ వేదికను శనివారం పార్టీ ప్రతినిధులు పరిశీలించారు. టీఆర్ఎస్ జిల్లా ఇన్‌ఛార్జి డాక్టర్ రఘు మాట్లాడుతూ.. కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించి జిల్లాకు తొలిసారిగా విచ్చేస్తున్న సందర్భంగా పెద్దఎత్తున ఆమె ఘనస్వాగతం పలుకుతున్నామన్నారు. పాంచజన్య పథకాన్ని ప్రకటించిన కవిత అందరికి ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి, వ్యవసాయ రంగానికి పెద్దపీట, ప్రజలందరికీ సామాజిక న్యాయం జరగాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారన్నారు. జిల్లా ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీఆర్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, పోచంపాడ్:** మెండోరా మండలం పోచంపాడ్ గ్రామంలో కల్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కులను సర్పంచ్ మాధురి రాజు శనివారం పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కల్యా ణ లక్ష్మి పథకం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పోచంపాడ్ గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ జాబితాకు సంబంధించి నోటీసులు అందుకున్న వారు తమకు సంబంధించిన ఆధారపత్రాలను బీఎల్‌వోలకు అందజేస్తున్నట్లు తెలిపారు. నోటీసులు వచ్చిన వారు సంబంధిత పత్రాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, అజ్జు, ఆసిఫ్, రియాజ్, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షలు, మేలో జరిగిన అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో పాసైన స్టూడెంట్ల ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లను ఇంటర్ బోర్డు సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది సెకండియర్ విద్యార్థులకు సంబంధించిన మెమోలను జిల్లాలకు డిస్పాచ్ చేశారు.

- అక్షరటుడే, ఎల్లారెడ్డి




# ఇంటర్ మెమోల్లో నకిలీలకు చెక్..

- జిల్లాలకు ఇంటర్ 'హై సెక్యూరిటీ' మెమోలు
- కాలేజీల వారీగా ఇంటర్ బోర్డు పంపిణీ
- సర్టిఫికెట్‌లో 25 రకాల సెక్యూరిటీ ఫీచర్లు
- తొలిసారిగా మెమోపై రెండు కలర్ ఫొటోలు, క్యూఆర్ కోడ్

ఇంటర్ బోర్డు నకిలీ సర్టిఫికెట్లకు చెక్ పెట్టడానికి ఆధునిక సెక్యూరిటీ ఫీచర్లతో మెమోలు తయారు చేసింది. వాటిని ఇప్పటికే జిల్లాలకు పంపింది. జనరల్ స్ట్రీమ్ విద్యార్థులు 3.50 లక్షల మంది ఉండగా, ఒకేషనల్ స్ట్రీమ్ వారు 50వేల మంది వరకు ఉన్నారు. కామారెడ్డి జిల్లాలో 6,997 మంది విద్యార్థులకు ఇంటర్ బోర్డు నుంచి హై సెక్యూరిటీ మెమోలు వచ్చాయి. గతంలో సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలల్లో వచ్చే సర్టిఫికెట్లు.. ఈసారి ముందుగానే అందుబాటులోకి రావడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెకండియర్ పాసైన విద్యార్థులకు వాటిని ఆయా కాలేజీలు అందించనున్నాయి.

### ట్యాంపరింగ్‌కు చెక్ పెట్టేలా..

సర్టిఫికెట్లు ట్యాంపరింగ్‌కు చెక్ పెట్టేలా ఇంటర్ బోర్డు జాగ్రత్తలు తీసుకుంది. గతంలో పదో తరగతి మెమోలు నకిలీ ఘటనల నేపథ్యంలో నాన్‌టియరబుల్‌తో పాటు వాటర్ రెసిస్టెంట్ ఫీచర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. నకిలీ సర్టిఫికెట్ల బెడద లేకుండా దాదాపు 25 రకాల పక్కా సెక్యూరిటీ ఫీచర్లను ఈ మెమోల్లో పొందుపరిచారు. గతంలో 15 మాత్రమే ఉండగా.. ఈసారి మరో 10 ఫీచర్లు పెంచారు.

### మెమోపై రెండు ఫొటోలు..

ఒకటి స్కానర్ ఫొటో కాగా, రెండోది సెక్యూరిటీ కోసం వాడే 'కోడెడ్' ఫొటో ఉంటుంది. ప్రతి మెమోపై క్యూఆర్ కోడ్, బార్ కోడ్‌తో పాటు బోర్డుకు సంబంధించిన ఇన్విజిబుల్ లోగోను ముద్రించారు. కొన్ని రహస్య సెక్యూరిటీ గుర్తులను కేవలం యూవీ లైట్‌లో చూసినప్పుడు మాత్రమే కనిపించేలా ఏర్పాటు చేశారు. దీంతో డూప్లికేట్ సర్టిఫికెట్లు సృష్టించడం అసాధ్యమని బోర్డు వెల్లడించింది. కొత్త మెమోలను అన్ని జిల్లా ఇంటర్ ఆఫీసులకు పంపించారు. వీటిని జిల్లా వారీగా కాలేజీల వారీగా ప్యాక్ చేసి ప్రిన్సిపాళ్లకు హ్యాండోవర్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ కాలేజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించి ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లు తీసుకోవాలని బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ సూచించారు.



## ఉద్యమకారుడు ఈర్ల శేఖర్‌కు పరామర్శ

**అక్షరటుడే, ఇందూరు:** అనారోగ్యంతో బాధపడుతున్న మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు ఈర్ల శేఖర్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆదే ప్రవీణ్ కుమార్ శనివారం పరామర్శించారు. పోచమ్మ గల్లీలోని ముదిరాజ్ వీధిలో ఉన్న శేఖర్ నివాసానికి వెళ్లిన ప్రవీణ్ కుమార్, ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మనోధైర్యాన్ని నింపారు. శేఖర్ ఆర్థిక పరిస్థితిని గమనించి ఆయనకు రెండు నెలలకు సరిపడా బియ్యం, పప్పులు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఆదే ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పింఛన్ సదుపాయం, ఉచిత బస్సు ప్రయాణం, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఉద్యమకారునికి 250 గజాల స్థలాన్ని కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఉద్యమకారులు కోనేరు సాయికుమార్, కరిపే రాజు, తుమ్మ నాగభూషణం, పాశుగంటి మహేష్, స్వర్గం రమేష్ పాల్గొన్నారు.

## క్రీడలతోనే సమగ్రాభివృద్ధి

**అక్షరటుడే, భీమ్‌గల్:** విద్యార్థుల శారీరక, మానసిక సమగ్రాభివృద్ధిలో క్రీడలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని ఎంఈవో, పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం స్వామి పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం భీమ్‌గల్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత 'హాకీ మాంత్రికుడు' మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్ పెంపొందుతాయని తెలిపారు.

### ధ్యాన్‌చంద్ సేవలు అమూల్యం..

హాకీ రంగంలో దేశానికి ఒలింపిక్ స్వర్ణ పతకాలు అందించి, బంతిపై అద్భుత నియంత్రణతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ధ్యాన్‌చంద్ జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయులు కొనియాడారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సదమస్తుల రమణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘువాస్, రాజ్‌కుమార్, వినోద్‌కుమార్, రాములు, వాసుదేవ్, శివకుమార్, వినోద్ సాగర్, భూమేశ్వర్, ఇమాన్యుల్, ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.



## పేట్ సంగంలో ఘనంగా క్రీడాదినోత్సవం

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేట్ సంగంలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయమ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ ఆధ్వర్యంలో బాలబాలికలకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ భారదేశానికి అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఆగస్టు 29 భారతదేశ హాకీ చరిత్రలో ఒక గొప్ప క్రీడా దిగ్గజం పుట్టిన రోజును క్రీడాదినోత్సవంగా జరుపుకోవడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమములో ఇన్‌ఛార్జి హెడ్ మాస్టర్ రవికుమార్, సత్యభూషణ్, గోవర్ధన్, జైపాల్, గీత, శైలజ తదితరులు పాల్గొన్నారు.



## నీట్ పీజీ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నీట్ పీజీ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. అర్సపల్లిలోని ఏవీ ఎంటర్ ప్రైజెస్, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. సరిపడా కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. నీట్ (పీజీ) పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు నీట్ (పీజీ) పరీక్ష కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఈవో అశోక్, డీఐఈవో రవికుమార్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ఏసీపీ ప్రకాశ్, తహశీల్దార్లు వినయ్ కుమార్, హరికిషోర్, కలెక్టరేట్ ఏవో బాలరాజు ఉన్నారు.



## ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్

**అక్షరటుడే, ముప్కాల్ :** ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తహశీల్దార్ ముంతాజుద్దీన్ శనివారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ యాదవ్, ఉప సర్పంచ్ సునీతభరత్ రాజ్, రెవెన్యూ సిబ్బంది రాఘవేంద్ర, జీపీవో నల్లన్న, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



## గౌలిగూడ జై బజరంగబలి గణేశ్ ఉత్సవ కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని గౌలిగూడలో జై బజరంగబలి గణేశ్ ఉత్సవ కమిటీని గౌలిగూడ ఆర్య క్షత్రియ సంఘం నాయకుల ఆధ్వర్యంలో శనివారం గౌలిగూడ మందిరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా హజారే ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మోతే ఆకాశ్, కార్యదర్శులుగా నగేష్, అజయ్, క్యాషియర్లుగా లాడే గణేశ్, వినయ్ ఎన్నికయ్యారు. ప్రతినిధులుగా మనోహర్, జ్ఞానేశ్వర్, చరణ్, ముఖ్య సలహాదారుగా నందు యధుబల్లెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య క్షత్రియ సంఘం అధ్యక్షుడు లాడే ప్రభాకర్, ఇంగొలి వెంకట్ రావు, హజారే బసంత్, అఘాలవే రాజు, యధుబల్లె వెంకట్ రావు, మాణిక్ మహరాజ్, కటికే శీను, పృధ్వీరాజ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



## 45వ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని 45వ డివిజన్‌లో కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో ఉన్న కాకతీయ స్కూల్ వెళ్లే రహదారిలో ఒకవైపు ఉన్న ఇనుప రాడ్ల కారణంగా ట్రాఫిక్‌కు విపరీతమైన అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ శనివారం మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ ఇనుప రాడ్‌లను తొలగింపజేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి.

## ఓటరు జాబితాలో తప్పులు సరిచూసుకోవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఏవైనా తప్పులు లేదా అనామలీస్ ఉంటే ఆలస్యం చేయకుండా సరిచేసుకోవాలని సూచించారు. లిస్ట్‌లో ఓటరు పేరు స్పెల్లింగ్ తప్పులు, వయస్సు/పుట్టిన తేదీలో తప్పులు, చిరునామా తప్పుగా ఉండటం లేదా మారడం, లింగంలో తప్పులు, డూప్లికేట్ ఓటరు నమోదు, మరణించిన వ్యక్తి పేరు జాబితాలో ఉండటం, అర్హత ఉన్నప్పటికీ పేరు లేకపోవడం వంటివి సరి చేసుకోవాలని సూచించారు. నోటీసులు అందిన వారు పత్రాలు అందించాలన్నారు.

### సవరణకు కావాల్సిన పత్రాలు..

ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, పదో తరగతి సర్టిఫికెట్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, రేషన్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డు/సర్వీస్ రికార్డు, నివాస ధృవీకరణ పత్రం వంటి ప్రభుత్వ పత్రాలను అవసరాన్ని బట్టి సమర్పించవచ్చు. ప్రతి ఓటరు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో మీ పేరు, వివరాలను పరిశీలించుకోవాలి. తప్పు ఉంటే వెంటనే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించాలి. సవరణ ఫారంతో పాటు ఆధార పత్రాలను సమర్పించాలి.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో మొత్తం 1,84,739 మందికి నోటీసులు జారీ చేశారు. ఇందులో నో మ్యాపింగ్ 19,157, అనామలిస్ 1,65,585 గా ఉన్నాయి. ఇప్పటివరకు 19,678 నోటీసులు అందజేయగా, 1,65,061 పెండింగ్ లో ఉన్నాయి. ఇప్పటి వరకు 199 హియరింగ్‌లు పూర్తయ్యాయి. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా తమ ధృవపత్రాలను హియరింగ్ కేంద్రంలో సమర్పించాలని అధికారులు సూచించారు. లేకపోతే ఓటు హక్కు పోతుందని పేర్కొన్నారు.

